క్లుప్తంగా

కుభీర్ ఎస్సైగా కృష్ణారెడ్డి



కుభీర్: కుభీర్ మండలానికి నూతన ఎస్సైగా కృష్ణారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా పని చేసిన రవీందర్ బదిలీపై దిలావర్‌పూర్ మండలానికి వెళ్లారు. కృష్ణారెడ్డికి ఇది తొలి పోస్టింగ్ కాగా.. సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

ఖానాపూర్ ఇన్‌చార్జి కమిషనర్‌గా జగదీశ్వర్



ఖానాపూర్: ఖానాపూర్ మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా నిర్మల్ మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాలిచ్చారు. ఇక్కడ పని చేసిన కమిషనర్ జాదవ్‌కృష్ణ విధుల్లో నిర్లక్ష్యం వహించడంపై సీడీఎంఏకు సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు రిటైర్డ్ ఉపాధ్యాయులకు సన్మానం

నిర్మల్ రూరల్: ఈ నెలలో ఉద్యోగ విరమణ పొందే ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం సత్కరించనున్నట్లు ఇన్‌చార్జి డీఈవో పరమేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు డీఈవో కార్యాలయంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఉద్యోగ విరమణ పొందే ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు, విద్యాశాఖ ఉద్యోగులు రావాలని కోరారు.

తప్పిన ప్రమాదం



రోడ్డుపై పడిన చెట్టు

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులకు జాతీయ రహదారిపై చెట్టు నేలకొరిగింది. ఆ సమయంలో ఎవరూ రాకపోవడంతో ప్రమాదం తప్పింది. రోడ్డుపై చెట్టు పడడంతో వాహనదారులకు ఇబ్బంది కలగకుండా గ్రామ యువకులు చెట్టు తొలగించారు.

సదర్ బోనాల పండుగ



బోనాలతో భక్తులు

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి గ్రామంలో శుక్రవారం శ్రీ బెల్లాల పోచమ్మ సదర్ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఆలయ ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా భక్తులు అమ్మవారికి బోనాలు తీసుకొచ్చి నైవేద్యంగా సమర్పించారు. పోతరాజుల విన్యాసాలు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అర్చకులు రాజశేఖర్‌శాస్త్రి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

దంపతులను కలిపిన భరోసా సెంటర్

నిర్మల్‌టౌన్: నిర్మల్‌రూరల్ మండలం ఎల్లపల్లి గ్రామంలోని ఒక జంట చిన్న మనస్పర్ధలతో దూరంగా ఉండడంతో.. వారిని శుక్రవారం భరోసా సెంటర్‌కు పిలిపించి ఎస్సై నర్సయ్య ఒక్కటి చేశారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. క్షణికావేశంలో దాంపత్య జీవితాన్ని నాశనం చేసుకుంటున్న ఎన్నో జంటలను భరోసా సెంటర్ ద్వారా కౌన్సెలింగ్ ఇచ్చి కలుపుతున్నామని పేర్కొన్నారు. ఎస్పీ జానకీషర్మిల ఎస్సై నర్సయ్యను అభినందించారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: పట్టలకు మద్దతు ధర పెంచినందుకు ప్రధాని మోదీ ప్రధాని చిత్రపటానికి బీజేపీ నాయకులు నిర్మల్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం పాలాభిషేకం చేశారు. అయ్యన్నగారి భూమయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లికార్జున్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆకుల కార్తీక్, సాయి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

వీడీసీ కార్యవర్గం

కుంటాల: మండలంలోని కల్లూరు వీడీసీ కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా భరత్ భూషణ్, ఉపాధ్యక్షుడిగా రాందాస్, క్యాషియర్‌గా రజినీకాంత్, రైటర్‌గా సాయిరాంగౌడ్, సభ్యులుగా లక్ష్మణ్ పటేల్, ముత్తన్న, నరేందర్‌రెడ్డి, భోజన్న, లద్దాఫ్, ప్రశాంత్, మహేశ్, శ్రీనివాస్, దత్తు, నారాయణ, పోశెట్టి, లక్ష్మణ్ ఎన్నికయ్యారు.

ఎత్తిపోయని పథకం..!

- నిరుపయోగంగా మన్మద్ లిఫ్ట్
- ఆనవాళ్లు కోల్పోతున్న కాలువలు
- వాగుపై చెక్‌డ్యాంలు నిర్మించాలంటున్న రైతులు



మన్మద్‌లో కాలిపోయిన ఎత్తిపోతల పథకం మోటారు



దెబ్బతిన్న వాల్ (ఫైల్)

లోకేశ్వరం: బీడు భూములను సాగులోకి తీసుకొచ్చేందుకు నిర్మించిన ఎత్తిపోతల పథకాలు అధికారుల పర్యవేక్షణ లేక పలుచోట్ల నిరుపయోగంగా మారాయి. దీంతో వాటిని నమ్ముకొని పంటలు సాగు చేసే రైతులు తల్లడిల్లుతున్నారు. లోకేశ్వరం మండలంలోని మన్మద్ గ్రామ శివారులో సుద్ద వాగును ఆనుకొని 2012లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.8 కోట్ల 50 లక్షలు వెచ్చించి ఎత్తిపోతల పథకం నిర్మించింది. రెండు 45 హెచ్‌పీ, రెండు 110 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన మోటార్లను బిగించింది. సుమారు 900 ఎకరాల్లోని పంటలకు సాగునీరు అందించేందుకు ఎత్తిపోతల పథకానికి రెండు ప్రధాన కాలువలు నిర్మించింది. తొలి ఎనిమిదేళ్లు ఆయకట్టు రైతులకు సాగు నీరు అందించింది. కానీ ఆ తర్వాత నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఈ పథకం నాలుగేళ్లుగా నిరుపయోగంగా మారింది.

నిర్వహణ లోపమే..

2012లో ఎత్తిపోతల పథకం ప్రారంభం కాగా ఎనిమిది సంవత్సరాలు బీడు భూములకు నీరందించగా రైతులు పంటలు పండించుకున్నారు. ఆ తర్వాత పథకం నిర్వహణలోపం రైతులకు శాపంగా మారింది. పథకాన్ని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు నీటి పారుదలశాఖ నిధులు మంజూరు చేయాల్సి ఉంది.

దెబ్బతిన్న మోటార్లు..

గడెన్నవాగు ఉధృతికి ఎత్తిపోతల పథకం పంపుహౌస్‌లోకి నీరు చేరడంతో మోటార్లు కాలిపోగా, విద్యుత్ తీగలు దెబ్బతింటున్నాయి. మరమ్మతులు చేపట్టి మళ్లీ సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

చెక్‌డ్యాం నిర్మించాలి..

ఎత్తిపోతల పథకం పంపుహౌస్ ఎదుట సుద్ద వాగుపై చెక్‌డ్యాం నిర్మించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ఎత్తిపోతల పథకం ద్వారా రైతులకు నీరందించే ప్రధాన కాలువల్లో పిచ్చిమొక్కలు పెరిగాయి. వాగుపై చెక్‌డ్యాం నిర్మిస్తే భూగర్భజలాలు పెరగడమేకాకుండా ఖరీఫ్‌లో తమ పంటలకు నీరందే మేలు జరుగుతుందని రైతులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తీసుకువచ్చి ఖరీఫ్‌కు నీరందించాలని రైతులు పేర్కొంటున్నారు.

మోటార్లు కాలిపోయాయి



ఎత్తిపోతల పథకం మోటార్లు కాలిపోయాయి. రైతుల కోసం రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన పథకం నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా అధికారులు మోటార్లకు మరమ్మతులు చేయించి.. వానాకాలంలో సాగునీరు అందిస్తారని ఎదురు చూస్తున్నాం.

– శంకర్‌గౌడ్, మన్మద్, రైతు

సుద్దవాగుపై చెక్‌డ్యాం నిర్మించాలి



సుద్దవాగుపై చెక్‌డ్యాం నిర్మిస్తే ఎత్తిపోతల పథకం ద్వారా ఆయకట్టు రైతులకు నీరందించడంతోపాటు భూగర్భ జలాలు పెరుగుతాయి. అధికారులు స్పందించి పథకం పునరుద్ధరించేటట్లు చేయాలి.

– రాజలింగం, ఎత్తిపోతల పథకం చైర్మన్, మన్మద్

మరమ్మతు చేపడుతాం

మన్మద్ ఎత్తిపోతల పథకం మోటార్లు కాలిపోయినట్లు సమాచారం అందింది. ఈ విషయం ఉన్నతాధికారులకు నివేదించాం. పైపులైన్ లీకేజీల వద్ద మరమ్మతులు చేపడుతాం. నిధులు మంజూరవగానే మోటార్లకు మరమ్మతులు చేయిస్తాం. రైతుల వినతి మేరకు చెక్‌డ్యాం నిర్మించాలని ఉన్నతాధికారులకు నివేదించాం. చెక్‌డ్యాం నిర్మిస్తే నీటి నిల్వలు పెరిగి ఎత్తిపోతల పథకం కింద పూర్తి ఆయకట్టుకు నీరందుతుంది.

– అనిల్, డీఈ, టీఎస్ఐడీసీ

కమీషన్ ఏజెంట్‌గా నిర్మల్ ఎమ్మెల్యే

- ఆయిల్‌పాం ఫ్యాక్టరీని అడ్డుకుంటున్నాడు
- ఏసీబీ దాడులు చేయాలి
- మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్ టౌన్: నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కమీషన్ ఏజెంట్‌గా మారాడని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆరోపించారు. నిర్మల్ నియోజకవర్గంలో వరి ధాన్యం కొనుగోలు ఆలస్యానికి ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి కారణమన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో శుక్రవారం మాట్లాడారు. వరి కొనుగోలులో అధికారులు 45 కిలోల బస్తాలో 4 కిలోల తరుగు తీసి, ఎమ్మెల్యేకు కమీషన్ ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఇంట్లో ఏసీబీ దాడులు చేయాలన్నారు. అకాల వర్షాల నుంచి రైతులను రక్షించాలని, సకాలంలో లారీలు పంపి ధాన్యం తరలించాలని సూచించారు.

ఆయిల్‌పాం ఫ్యాక్టరీకి అడ్డంకులు

నిర్మల్‌కు తాను తీసుకొచ్చిన ఆయిల్‌పాం ఫ్యాక్టరీని మహేశ్వర్‌రెడ్డి రూ.5 కోట్లు డిమాండ్ చేస్తూ అడ్డుకుంటున్నారని ఇంద్రకరణ్ ఆరోపించారు. ఈ ఫ్యాక్టరీతో రైతులు, నిరుద్యోగులకు మేలు జరుగుతుందని, కానీ ఎమ్మెల్యే దాన్ని రాజకీయ కారణాలతో నిలిపివేశారని విమర్శించారు. బీజేపీ కార్యకర్తలు ఇసుక దందా చేస్తున్నారని, చెక్ డ్యామ్‌ల నుంచి ఇసుక తీసిన తర్వాతే నీరు విడుదల చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యే సంవత్సరంన్నరలో రూపాయి పని చేయలేదని, నిర్మల్ ప్రజల సమస్యలపై ఆయనకు శ్రద్ధ లేదని ఇంద్రకరణ్ విమర్శించారు.

ఈఈ అక్రమాలు..

ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ బంధువైన అనిల్‌ను ఇన్‌చార్జి ఈఈగా నియమించుకుని దందాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈఈ చెక్ డ్యాముల నుంచి ఇసుక మొత్తం తీసేసిన తర్వాత మే 15న నీరు విడుదల చేశారన్నారు. స్వర్ణ ప్రాజెక్టు నీరు విడుదల చేసినప్పుడు పట్టణంలోని జీఎస్‌ఆర్ కాలనీకి ఎదురు నీరు రావడంతో ముంపుకు గురవుతుందని చెప్పారు. అది గుర్తించకుండా.. చెక్‌డ్యాం పేల్చేశారని మండిపడ్డారు. ఈఈ ప్రతీపని ఎమ్మెల్యే చెప్పినట్టు చేస్తూ.. నష్టం చేస్తున్నాడని ఆరోపించారు. చెక్ డ్యాం కూల్చివేతపై కోర్టును ఆశ్రయిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజీగారి రాజేందర్, పీఏసీఎస్ చైర్మన్ రమణారెడ్డి, నాయకులు అప్పాల మహేశ్, మహిపాల్‌రెడ్డి, విజయ్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



బాసరలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కుంటాల: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని పంచాయతీ కార్యదర్శి రాజబాపు పేర్కొన్నారు. శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. టీచర్ గుణసుందరి, ఆశా వర్కర్లు లక్ష్మి, దేవకి, విజయ, మమత పాల్గొన్నారు.

బాసర: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీవో గంగాసింగ్, వైద్యాధికారి ఆకాష్ తెలిపారు. శుక్రవారం బాసర గ్రామపంచాయతీ కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై సమీక్ష నిర్వహించారు. మలేరియా, డెంగీ వంటి ప్రమాదకర వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య చర్యలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఏఎన్‌ఎంలు ఆశవర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నిల్వనీటిని పారబోయాలి

బాసర: వ్యాధులు ప్రబలకుండా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ గౌడ్ అన్నారు. మండలకేంద్రంలో సిబ్బందితో పర్యటించి.. పరిసరాల్లో నిల్వనీటిని పారబోయించారు. డ్రెయినేజీలకు అడ్డంగా రాళ్లు, జాలీలు పెడితే ఆ ఇంటికి జరిమానా విధించాలని సిబ్బందికి సూచించారు. ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

దస్తురాబాద్: మండలంలోని పేర్కపల్లెలో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి నాగరాజు సిబ్బందితో కలిసి కాలనీలను పరిశీలించారు. ఆరోగ్యవిస్తరణాధికారి ఎస్.కన్నయ్య, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, గీతాంజలి, మల్లీశ్వరి తదితరులు ఉన్నారు.

'మధ్యవర్తులను ఆశ్రయించొద్దు'

భైంసాటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువవికాసం రుణాల కోసం మధ్యవర్తులను ఆశ్రయించొద్దని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బి.నారాయణ్‌రావు పటేల్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారులు, పార్టీ నాయకులు లబ్ధిదారుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తే సహించేది లేదన్నారు. ప్రభుత్వానికి చెడ్డపేరు రానివ్వమని.. ఎవరైనా డబ్బులు అడిగితే తమకు సమాచారమివ్వాలని కోరారు.

'వరద సమస్య పరిష్కరించాలి'

తానూరు: ఏటా వర్షాకాలంలో సమీపంలోని గుట్ట ప్రాంతం వరద తమ వీధుల్లో చేరుతుండటంతో నిత్యావసర సరుకులు, ఎరువులు, విత్తనాలు తడిసిపోతున్నాయని మండలంలోని కల్యాణి గ్రామస్తులు పేర్కొన్నారు. భారీ వర్షాలు కురిస్తే ఇళ్లకే పరిమితం అవుతున్నామని.. తమ గ్రామంలోకి వరద రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈమేరకు తహసీల్దార్ లింగమూర్తి, ఎంపీడీవో కార్యాలయాల్లో వినతిపత్రం అందజేశారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి

ఖానాపూర్: ఖానాపూర్, కడెం మండలాల్లో నకిలీ విత్తనాల బెడదను అరికట్టాలని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శులు పీటర్, సురేందర్ అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలో మాట్లాడారు. నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి వస్తున్నప్పటికీ విజిలెన్స్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కొత్తగా వస్తున్న వరి, పత్తి, మొక్కజొన్న విత్తనాలపై ప్రత్యేక దృష్టి సారించి విచారణ చేయాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేని దుకాణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పీహెచ్‌సీల ఇలా.. వచ్చేదెలా?



బురదమయంగా ఆసుపత్రి ఆవరణ

కుభీర్: మండలకేంద్రంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆవరణలో వరద చేరి అధ్వానంగా మారింది. పక్కనే ఉన్న డ్రెయినేజీని శుభ్రం చేయకపోవడంతో మురుగు నీరంతా వచ్చి ఆసుపత్రి పరిసరాల్లో చేరడంతో అక్కడకు వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు.

నర్సరీ పరిశీలన

కుంటాల: మండలకేంద్రం శివారులోని నర్సరీని శుక్రవారం ఎంపీడీవో లింబాద్రి పరిశీలించారు. జూన్ మాసంలో వర్షాలు కురవగానే మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట పంచాయితీ కార్యదర్శి రాజబాపు తదితరులు ఉన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసు



కల్లూరులో రిజిస్టర్ పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్



కడెంలో డీఆర్డీవో విజయలక్ష్మి, అధికారుల తనిఖీ



గడువు ముగిసిన మందులు విక్రయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఆర్డీవో కోమల్‌రెడ్డి

కుంటాల: నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని డీపీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కల్లూరు, కుంటాలలో ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్లు, ధరల పట్టిక, లైసెన్స్ పరిశీలించారు. తహసీల్దార్ కమల్‌సింగ్, ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో రహీంఖాన్, ఏవో విక్రమ్, ఆర్ఐ రాజేశ్వర్, కార్యదర్శి భోజన్న ఉన్నారు.

కడెం: నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని డీఆర్డీవో విజయలక్ష్మి, తహసీల్దార్ ప్రభాకర్, ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి అన్నారు. కడెంలోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణ యజమానులకు పలు సూచనలు చేశారు. వారి వెంట ఏవో దినేశ్, సిబ్బంది ఉన్నారు.

తానూరు: నకిలీ విత్తనాలు విక్రయిస్తే డీలర్లపై చర్యలు తీసుకుంటామని ఏవో మనీషా అన్నారు. శుక్రవారం తానూరు, జౌలా(బి)లోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ట్రైయినీ ఎస్సై నవనీత్ రెడ్డి, ఏఈవోలు ఉన్నారు.

దస్తురాబాద్: మండలంలోని పెర్కపల్లె, మున్యాల, దస్తురాబాద్, రేవోజీపేట గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను అధికారులు తనిఖీ చేశారు. తహసీల్దార్ విశ్వంబర్, ఎస్సై సాయికృష్ణ, ఏఈఓలు తిరుపతి, కిరణ్, కార్యదర్శులు రాజశేఖర్, సత్యనారాయణ, రంజిత్ ఉన్నారు.

గడువు ముగిసినవి విక్రయిస్తే కేసు

భైంసాటౌన్: నకిలీ విత్తనాలు, గడువు ముగిసిన మందులను రైతులకు విక్రయిస్తే డీలర్లపై కేసులు నమోదు చేస్తామని ఆర్డీవో కోమల్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని పలు విత్తన దుకాణాల్లో ఏడీఏ వీణతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, విత్తన నిల్వలు పరిశీలించారు. పలు దుకాణాల్లో గడువు ముగిసిన మందులు కనిపించడంతో డీలర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఏవో గణేశ్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

జొన్నల కేంద్రం పరిశీలన

సారంగాపూర్: మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు రాంకిషన్‌రెడ్డి, లక్ష్మీనారాయణగౌడ్ పరిశీలించారు. 15 రోజుల కిందట జొన్నలను తీసుకొచ్చినా కొనడం లేదని రైతులు విన్నవించారు. జొన్నలను కొనకపోతే ఆందోళన చేపడుతామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. భోజారెడ్డి, రైతులు తదితరులు ఉన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

కుంటాల: యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారుతామని ఎంపీడీవో లింబాద్రి పేర్కొన్నారు. స్థానిక యోగా కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవ దశాబ్ది వేడుకలు నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం వైద్యశాల ఆవరణలో మొక్కలు నాటారు. వైద్యురాలు అమృతయాని, కార్యదర్శి రాజబాపు, శిక్షకులు సంతోష్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన రిలే నిరాహార దీక్ష

భైంసాటౌన్: ముధోల్ మండలం రాళ్ల బోరిగాంలో బుద్ధ విగ్రహం పునఃప్రతిష్ఠించాలని విగ్రహ పరిరక్షణ కమిటీ నాయకులు భైంసా పట్టణంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష శుక్రవారం ఐదో రోజుకు చేరింది. పలువురు మాట్లాడుతూ విగ్రహం తొలగించిన అధికారులు వెంటనే విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కమిటీ అధ్యక్షుడు దేవిదాస్ హస్తే, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, కోశాధికారి రాజారాం, గిరిధర్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో పోషకుల సమావేశం

తానూరు: మండలంలోని గ్రామాల్లో శుక్రవారం ఉపాధ్యాయులు పోషకుల సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ సెలవుల్లో విద్యార్థులతో బొమ్మలు గీయడం, కథల పుస్తకాలు చదవడం నేర్పించాలన్నారు. ఫోన్ వినియోగంతో కలిగే అనర్థాలను పోషకులకు వివరించారు. బడి బయట ఉన్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు.ఉపాధ్యాయులు సుధాకర్, యోగేశ్, అఖిల్, శివాజీ తదితరులు ఉన్నారు.

నిబంధనలు పాటించాలి

తానూరు: వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ట్రైయినీ ఎస్సై నవనీత్ రెడ్డి సూచించారు. శుక్రవారం హిప్నెల్లి గ్రామ సమీపంలో భైంసా–తానూరు రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సిబ్బంది తదితరులు ఉన్నారు.

'ఆపరేషన్ కగార్ నిలిపివేయాలి'

ఖానాపూర్: కేంద్రప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. నక్సలైట్లను ఎన్‌కౌంటర్ చేయడం సరికాదని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న కళాజాత ప్రదర్శన

కుంటాల: కలెక్టర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై శుక్రవారం మండలంలోని అందాకూర్ గ్రామంలో కళాజాత నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి రమ్య, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు లక్ష్మణ్ రఘు, సుదర్శన్, నాగరాజు, సుధాకర్ స్వామి, జితేందర్ పాల్గొన్నారు.

జనావాసాల్లోకి నెమలి

ఖానాపూర్: పట్టణంలోని అంగడిబజార్‌లో జామా మసీద్ ఆవరణలోకి శుక్రవారం జాతీయ పక్షి నెమలి వచ్చింది. అటవీ ప్రాంతం నుంచి వచ్చి చెట్లపై తిరుగుతున్న నెమలి వెంట కోతులు పడటంతో స్వల్పంగా గాయపడింది. కదల్లేనిస్థితిలో ఉన్న నెమలిని స్థానికులు పట్టుకుని అటవీశాఖ అధికారులకు అప్పగించగా వారు అటవీ ప్రాంతంలో వదిలేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

కుంటాల: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈవో ముత్యం పేర్కొన్నారు. బడిబాటలో భాగంగా శుక్రవారం కుంటాలలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పోషకులు, మాజీ ఎంపీపీ గజ్జారాం, హైమద్, ఉపాధ్యాయుడు మారుతి తదితరులు ఉన్నారు.

బస్సుల కోసం నిరీక్షణ



బాసర: శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకునేందుకు శుక్రవారం భారీ సంఖ్యలో భక్తులు బాసర వచ్చారు. పలువురు తల్లిదండ్రులు తమ చిన్నారులకు అమ్మవారి సన్నిధిలో అక్షరాభ్యాసం చేయించారు. భక్తులు తిరిగి సొంత ఊళ్లకు వెళ్లేందుకు ఇబ్బంది పడ్డారు. సుమారు రెండు గంటలపాటు బాసర బస్టాండ్, ప్రధాన రోడ్డుకు ఇరువైపుల చిన్నారులతో వేచి ఉన్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి అమ్మవారి సన్నిధికి వచ్చేందుకు బస్సుల సంఖ్య పెంచాలని భక్తులు కోరుతున్నారు.

పడేదాకా స్తంభాలను పట్టించుకోరా?



ధర్మారం కోతిదేవుడి ఆలయ సమీపంలో..



పీచరలోని ఒడ్డెర కాలనీకి ఎదురుగా వంగిన స్తంభం



లక్ష్మణచాంద నుంచి పీచర వెళ్లే మార్గంలో వంగిన స్తంభం

లక్ష్మణచాంద: మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ భూముల్లో, రోడ్డు పక్కన పలు విద్యుత్ స్తంభాలు వంగి ప్రమాదకరంగా మారాయి. కొద్దిరోజుల్లోనే ఖరీఫ్ సాగు పనులు ప్రారంభం కానున్నాయి. విద్యుత్ అధికారులు స్పందించి వంగిన స్తంభాలకు మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.